## 156వ అధ్యాయం

## ١٥٦ ـ بَابُ اسْتِحْبَابِ تَكْثِرِ الْمُصَلِّينَ عَلَى الْجَنَازَةِ وَجَعْلِ صُفُوفِهِمْ ثَلاثَةً فَأَكْثَرَ

## జనాజా నమాజ్‌లో ఎక్కువ మంది పాల్గొనటం, మూడు లేదా అంతకంటే ఎక్కువ పంక్తులుగా నించోవటం అభిలషణీయం

932. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు : ఏ మృతుని జనాజా నమాజులోనయినా వందమంది ముస్లింలు పాల్గొని, వారందరూ మృతుని మన్నింపు కొరకు ప్రార్థిస్తే, అతని విషయంలో వారి సిఫారసు ఆమోదించబడుతుంది. (ముస్లిం)

٩٣٢ ـ عَنْ عَائِشَةَ رَضِيَ الله عنها قَالَتْ: قَالَ رسولُ اللهِ ﷺ: «مَا مِنْ مَيِّتٍ يُصَلِّي عليهِ أُمَّةٌ مِنَ الْمُسْلِمِينَ يَبْلُغُونَ مائَةً كُلُّهُم يَشْفَعُونَ له إلا شُفِّعُوا فِيهِ» رواه مسلم.

*(సహీహ్ ముస్లింలోని జనాయెజ్ ప్రకరణం)*

933. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) తెలియజేశారు : ఏ ముస్లిం వ్యక్తి అయినా చనిపోయి నప్పుడు దైవంతోపాటు ఇతరుల్ని భాగస్వాములుగా నిలబెట్టని (షిర్క్ చేయని) నలభైమంది గనక అతని జనాజా నమాజ్‌లో పాల్గొంటే దేవుడు అతని విషయంలో వారందరి సిఫారసునూ ఆమోదిస్తాడు. (ముస్లిం)

٩٣٣ ـ وعن ابنِ عباسٍ رضيَ الله عنهما قال: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يقُولُ: «مَا مِنْ رَجُلٍ مُسْلِم يَمُوتُ، فَيَقُومُ عَلَى جَنَازَتِهِ أَرْبَعُونَ رَجُلاً لَا يُشْرِكُونَ بِاللهِ شَيئاً إِلَّا شَفَّعَهُمُ اللهُ فِيهِ» رواه مسلم.

*(సహీహ్ ముస్లింలోని జనాయెజ్ ప్రకరణం)*

٩٣٤ ـ وعن مَرْثَدِ بن عبدِ الله اليَزَنِيِّ قال: كانَ مَالِكُ بنُ هُبَيْرَةَ رضي الله عنه إذا صَلَّى عَلى الجنازَةِ، فتَقَالَّ النَّاسَ عَلَيها، جَزَّأَهُمْ عَليها ثَلاثَةَ أَجْزاءٍ، ثم قال: قالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ صَلَّى عَلَيهِ ثَلاثَةُ صُفُوفٍ، فَقَدْ أَوْجَبَ». رواه أبو داود، والترمذي وقال: حديث حسن.

934. హజ్రత్ మర్సద్ బిన్ అబ్దుల్లాహ్ యజనీ కథనం : హజ్రత్ మాలిక్ బిన్ హుబైరా (రజి) తను జనాజా నమాజ్ చేసినప్పుడు నమాజ్‌లో పాల్గొనేవారు తక్కువగా ఉన్నారని తనకు అనిపిస్తే, ఆయన వారిని మూడు పంక్తుల్లో నిలబెట్టేవారు. ఆ సందర్భంగా దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారని ఆయన ప్రజలకు తెలియపరిచేవారు: ఏ మృతుని కొరకయినా మూడు పంక్తుల జనం జనాజా నమాజ్ చేస్తే, ఆ మృతుడు తన కొరకు స్వర్గాన్ని అనివార్యం చేసుకుంటాడు.

*(అబూ దావూద్, తిర్మిజీ - హసన్)*

*(సునసె అబూ దావూద్, సునసె తిర్మిజీలోని జనాయెజ్ ప్రకరణాలు)*

## ముఖ్యాంశాలు

1. జనాజా నమాజ్‌లో ఎంత ఎక్కువ మంది పాల్గొంటే మృతుని కొరకు అది అంత మంచిదని పై హదీసుల ద్వారా బోధపడుతోంది. అయితే దానికోసం నమాజ్‌లో పాల్గొనేవారు ఏకదైవారాధకులు, సదాచార సంపన్నులు అయి ఉండటం అవసరం. బహుదైవారాధకులు, ధర్మభ్రష్టులు ఎంతమంది జనాజా నమాజ్‌లో పాల్గొన్నా దానివల్ల మృతునికి ప్రయోజనం ఉండదు.
2. జనాజా నమాజ్ చేసేవారు తక్కువమంది ఉన్నప్పుడు మూడు పంక్తులుగా నిలబడటం ఉత్తమం.